"బర్త్‌డే దేముందోయ్ మనిష్టం. ఇక్కడ బ్రాంచికి కొత్తగా వచ్చాను. ఎన్నాళ్ళుంటానో తెలియదు. పార్టీ పెట్టాలనిపించింది. అకేషన్ దొరకలేదు. అందుకని ఇది. దీనివల్ల రెండు లాభాలు-ఒకటి మన ప్రిస్టేజ్ పెరుగుతుంది. రెండోది మనప్రాపకం కోసం ప్రాకులాడే వాళ్ళు విధిగా మంచి బహుమతులు తెస్తారు. అదిగో అటు చూడు" అని చూపిస్తున్నారు మా బ్రాంచి మేనేజరుగారు.

ఆయన చూపించిన వేపు మినీ ఫ్రిజ్, ప్రెజర్ కుక్కర్, వాటర్ ఫిల్టర్, మిక్సీలు, ట్రాన్సిస్టర్లు, టు-ఇన్-వన్‌లు వగైరాలు.

బ్రాంచి మేనేజర్‌గారితో మాట్లాడుతున్న వ్యక్తి "హేట్స్ ఆఫ్ టు యువర్ వైజ్—" మిగతా మాటలు నేను వినలేదు. చాలీ చాలని జీతాలతో మేము కష్టపడి కొన్న ప్రజంటేషన్స్ నన్ను చూసి వెక్కిరిస్తున్నట్టుగా భ్రమపడ్డాను.

....★....

# బదిలీ

అధికారం చేతిలో ఉంటే ఏ పనైనా చేసుకోవచ్చు అనుకోవడం పొరపాటు.

అది ఒక ప్రభుత్వ కార్యాలయం, కాకినాడలో ఉంది. శాఖలు రాజమండ్రి, విశాఖపట్నం, పలాస, ఇచ్ఛాపురంలో ఉన్నాయి. చాలామంది సిబ్బంది. అందువల్ల ఆఫీసరుగారు శాఖా కార్యాలయాలన్నీ తిరుగుతూ ప్రధానమంత్రి విదేశీ పర్యటనలు చేస్తూ అప్పుడప్పుడూ దేశంలో ఉన్నట్లుగా—కాకినాడలో నాలుగురోజులు ఉండి సంతకాలు పెడుతూ ఉంటారు.

ఆ ఆఫీసులో డిఫెన్సు విభాగంలో చిన్న ఉద్యోగి మురళి—అఫీసరు గారికి స్వయానా బావమరిది. దానితో ముఖ్యమంత్రిగారి చిన్నల్లుడులాగా ఆఫీసులో అందరిమీదా అధికారం చెలాయిస్తుంటాడు. అతనికి కళ్ళెం వెయ్యడం ఎవరివల్లా కావడంలేదు.

సిబ్బంది గుమాస్తా తలవంచుకుని పనిచేసుకుంటున్నాడు. అతని దగ్గరకు ఆఫీసరుగారి బావమరిది వచ్చాడు.

"ఏమయ్యా? ఆయన వచ్చే సమయం అయ్యింది. సంతకాలకుఅన్నీ తయారుచేశావా? మళ్ళీ రెండుమూడు రోజుల్లో ఢిల్లీ వెళతారుట. ఢిల్లీ లో నెల రోజులు డిజైన్స్ మీటింగ్సులో పొల్గొని అప్పుడు వస్తారుట. నెల రోజులదాకా ఆయన ఉండరు కదా అని పని అంతా చేసుకో"

"వీడి శిమ్మడ! వీడే నాకు మొగుడయ్యాడు" అని లోపల తిట్టుకుంటూ (సి. గు.) సిబ్బంది గుమాస్తా "చేస్తున్నానండి అంత కంగారు పడితే ఎలాగు? మేమూ మనుషులమేకదండీ?" అన్నాడు.

"తెలుస్తూనే ఉంది. ఒళ్ళు దగ్గరపెట్టుకుని పనిచెయ్యి, లేకపోతే ఇచ్ఛాపురం బదిలీచేయిస్తాను. మా బావగారితో చెప్పి-" అసెంబ్లీలో బంపర్ మెజారిటీ ఉన్న ముఖ్యమంత్రిలా గర్వంగా మాట్లాడసాగాడు మురళి.

"అయ్య అలాగేనండి" అని లోపల తిట్టుకుంటూ "సి గు" పని చేసుకోసాగాడు.

ఈ లోగా ఆఫీసరుగారు వస్తున్నట్లుగా జీపు హారన్ శబ్దం వినపడింది. కార్యాలయం అంతా అప్పటివరకూ చేపలబజారులా ఉన్నది నిశ్శబ్దంగా అయిపోయింది.

ఆఫీసరుగారి గదిలో ఫైల్స్ గుట్టలుగుట్టలు పడిఉన్నాయి. శాఖలవారీగా విభజించి ఉంచారు ఫైల్సు. ఎవరి ఫైల్సు చూస్తుంటే వారిని పిలిచి సంతకాలు పెడుతున్నారు. ఆయన సిబ్బంది సమస్యలు ఎక్కువ కాబట్టి సిబ్బందికి సంబంధించిన ఫైల్సు చివరపెట్టారు.

రాత్రి తొమ్మిదయింది. ఆఫీసరుగారికి చాలా విసుగ్గా ఉంది. ఆ సమయంలో "సి. గు" గారికి పిలుపు వచ్చింది.

లోపలకు వెళ్ళి అన్నీ ఆయనకు వివరంగా చెప్పి-సంతకాలుపెట్టించాడు. "సి గు"-సి.గు" అంటే ఆయనకు గురి ఎక్కువ—అందుకని అతను ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ ఒక్కోసారి కాగితాలు చూడకుండాకూడా సంతకంపెట్టిన సందర్భాలు ఉన్నాయి.

ఆ రాత్రి కార్యాలయంనుంచి వెళ్ళిపోతూ—విశాఖపట్నం చిన్న ఆఫీసరు అర్జెంటు పనులు చూస్తారని చెప్పి ఆయన వెళ్ళిపోయారు.

మర్నాడు మధ్యాహ్నం మురళిని ఇచ్ఛాపురం బదిలీ చేస్తున్నట్లు ఆ రోజే రిలీవ్ చేసినట్లు ఆర్డర్సు ఇచ్చారు. వాటిమీద స్వయానా అతని బావగారయిన ఆఫీసర్‌గారే సంతకం పెట్టారు.

మురళి "సి. గు" దగ్గరకువచ్చి-"ఏమిటిది? అన్నాడు.

"తెలయడంలా—మీకు ట్రాన్స్ఫర్ ఆర్డర్సు"

"మా బావగారే సంతకంపెట్టారా?"

"అవును"

"ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేశారు నన్ను?" మంత్రివర్గం నుండి డిస్మిస్ అయిన మంత్రిలా దీనంగా అడిగాడు.

"ఏమో పైనుంచి టెలిగ్రాఫిక్ ఆర్డర్సువచ్చాయ్-మిమ్మల్ని బదిలీ చెయ్యమని."

"అలాగా" అంటూ-వెళ్ళిపోయాడు మురళి.

o o o

ఆఫీసరుగారి ఇంటి దగ్గర-

"అక్కా- చూశావా? బావగారెంత పనిచేశారో? నన్ను ఇచ్ఛాపురం బదిలీ చేశారు.

"నిజమేనటరా?" ఆవిడ ఆందోళనగా అంది.

"నువ్వు ఈ బదిలీ ఆపుచేయకపోతే నేను ఆఫీసులో తల ఎత్తుకుని తిరగలేను. ఢిల్లీకి ట్రంక్‌కాల్ చెయ్యక్కా" అన్నాడు.

ట్రంక్‌కాల్ చేశారు.

"హలో మీరేనా-? మా తమ్ముణ్ణి ఇచ్ఛాపురం ట్రాన్స్‌ఫర్ చేశారా? ఎందుకు?

"ఏమిటి నువ్వు మాట్లాడేది

" - " మళ్ళి చెప్పిందామె.

"ఎందుకని ?"

"పైనుంచి టెలిగ్రామ్ వచ్చిందనీ, మీరే చెప్పారని "సి. గు" చెప్పారట.

"అలాగా? వెళ్ళి చేరమను"

"మీరున్నారనే ధైర్యంతో నాకు తోడుగా ఉంటాడని తీసుకు వచ్చాను. భలే నిర్వాకం చేశారు."

"నేను వచ్చాక చూద్దాంలే. చేరమను వెళ్ళి" అన్నాడు. ఆయనకు ఆ కాగితం చూసిన గుర్తులేదు. అయినా భార్యముందు పలుచుపోకుండా సంబాళించుకున్నాడు.

○ ం ○

రైలుస్టేషన్‌లో "సి గు" అటూ ఇటూ తిరుగుతున్నారు.

మురళి ఎదురయ్యాడు. ఇచ్ఛాపురం వెళుతున్నాడు. అతన్నిచూసి– "సి. గు" "అయితే ఇచ్ఛాపురం వెళుతున్నారా? ఏ రాజమండ్రికో బదిలీ చెయ్యక ఇచ్ఛాపురం బదిలీ చేశారేమిటండీ?—మీ బావగారు ఇలా చేశారేమిటి?" అన్నాడు.

రాజకీయంలో తన ప్రత్యర్థి చనిపోతే మనస్సులో తనకెవరూ పోటీ లేరని సంతోషపడుతూ పైకి భోరున ఏడుస్తూ-సంతాపంవెలిబుస్తున్న రాజకీయనాయకుడిలా.

"ప్రస్తుతానికి చేరుతున్నాను. మాబావగారు వచ్చాక మళ్ళీ కాకినాడ వస్తాను" అన్నాడు—అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థి—కౌన్సిల్ ఎన్నికలులేవా? జిల్లా పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక లేదా అన్నట్లుగా.

"అంతేలెండి. ముందు ఆర్డర్సు ప్రకారం చేరడం మంచిది."

మురళీ తనను ఇచ్ఛాపురం బదిలీ చేయిస్తానన్నందుకు-అతన్నే ఇచ్ఛాపురం బదిలీచేస్తూ-రిలీవ్ చేస్తూ ఆర్డర్సు మామూలుకాగితాల్లో పెట్టి-అతని బావగారి చేతనే సంతకం పెట్టించిన "సి. గు." మురళికి "బై" చెప్పాడు సంతోషంతో. పాత తేదీతో ఒక టెలిగ్రామ్ పుట్టించాలి పై ఆపీసునుంచి ఈ నెలలోగా అనుకుంటున్నాడు-"సి. గు"

....ం....